
# మీనాక్షి వాగ్దానం

## ప్రతాప రవిశంకర్

దక్షిణ భారతదేశంలో చివరివరకూ వెళితే ఆకాశం సముద్రంలో కలిసిపోతున్నట్టు వుంటుంది. ఆ దృశ్యాన్ని చూడటం నాకో గొప్ప అనుభూతి. ఆకాశాన్ని అంటుతున్న ఆలయ గోపురాలూ, విశాలమైన ప్రాకారాలూ, నిత్యం భక్తుల రాకపోకలతో సందడిని తమలో నింపుకున్న కోవెలలూ ఒక్క దక్షిణాదికే సొంతం. వర్షం పడుతున్నప్పుడు చలిలో వణుకుతూ రామేశ్వరంలో బ్రహ్మీకాలంలో సముద్రస్నానం, కన్యాకుమారిలో సముద్రం వొడ్డున రాతిమీద కూర్చుని సూర్యాస్తమయాన్ని చూడటం నాకు అత్యంత ఇష్టమయిన విషయాలు.



ఇందుకోసమే నేను వీలు దొరికినప్పుడల్లా ఆవైపుకు ప్రయాణం సాగిస్తుంటాను. ఐతే ఈసారి ప్రయాణంలో మీనాక్షి అమ్మాళ్ నాలో ఓ ప్రత్యేకమైన అనుభూతిని మిగల్చటం మరిచిపోలేనిది. తనతో వచ్చిన వాళ్లనుంచి విడిపోయి దారి తెలియక దిక్కులు చూస్తూ మీనాక్షి అమ్మాళ్ నాకు తటస్థపడకుండా వుంటే అసలు ఈ కథే వుండేది కాదు. ఆమెకి ఆ మధురై మీనాక్షి దేవాలయాన్ని దర్శించటం అదే మొదటిసారిట. నాకు అలా కాదు. అప్పటికి కొన్నిసార్లు ఆ దేవాలయాన్ని సందర్శించాను. అందువల్ల విశాలమైన ఆ కోవెలలో నాకు ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేదు.

అన్నివైపులకీ పరుగులు తీస్తున్న ఆమె చూపులూ, ముఖంలో కనపడుతున్న ఆందోళననీ గమనించి నేనే అడిగాను ఆమెను వచ్చీరాని తమిళంలో ''ఏమిటీ విషయం?'' అని.

గబగబా తమి

శంలో ఏదో చెప్పింది గానీ అర్థంకాలేదు.

అలవాటుగా ''ఏమిటి?'' అన్నాను తెలుగులో.

''మీరు తెలుగువాళ్ళా!''

''అవును. నాపేరు కనకసుందరం'' పరిచయం చేసుకున్నాను.

ఆమె తన పేరు మీనాక్షి అమ్మాళ్ అని చెప్పి తన వాళ్లనుంచి ఎలా విడిపోయిందీ వివరించి చెప్పింది. ఆమెక్కూడా నాలాగే శిలలన్నా, శిల్పాలన్నా, ప్రాచీన కట్టడాలన్నా బాగా ఇష్టంట. తను తన్మయంగా వాటిని చూడటంలో నిమగ్నమయినప్పుడు తను వాళ్లతో వస్తున్నదో లేదో చూసుకోకుండా ఆమె తల్లీ, మిగిలినవాళ్లూ వెళ్ళిపోయారుట మీనాక్షిని వొంటరిదాన్ని చేసి.

ఈ మీనాక్షి ఆలయం పన్నెండవ శతాబ్దంలో సుందర పాండ్యన్ పరిపాలనా కాలంలో నిర్మించబడిందిట. తొమ్మిది అంతస్థుల గోపురాలూ, నాలుగు దిక్కులా ముఖద్వారాలూ, ఎన్నో మండపాలతో నిండివున్న ఆ దేవాలయంలో ఒకరినొకరు తప్పిపోవటం అంత కష్టమేమీ కాదు.

''ఇంతకీ అమ్మవారిని దర్శించారా?'' అడిగాను.

''లేదు. ఎక్కడా? ఈలోపలే వీళ్లు..'' అంటూ ఏదో చెప్పబోయింది.

''పోన్లెండి. ఇప్పుడు దర్శించుకుందాం.''

''ముందు వాళ్లను కలవాలి.''

''కలవొచ్చు. వాళ్లూ ఎక్కడో మీకోసం వెతుకుతూ వుండొచ్చు. మిమ్మల్ని మీ వాళ్ల దగ్గరకు నేను చేరుస్తాను. నాకు ఇక్కడంతా బాగానే తెలుసు. రండి.''

ముందుకు నడిచాను. ఏమనుకుందో ఏమో గానీ ఆమె కూడా నా వెనుకనే నడిచింది. జనం మరీ ఎక్కువగా లేరు. ముందు నేను – నా వెనుక మీనాక్షి – ఎదురుగా మీనాక్షి అమ్మవారు.

రెండు చేతులూ జోడించి భక్తితో కళ్లు మూసుకుంది మీనాక్షి నా పక్కనే నిల్చుని. ముఖాన తమిళ సంప్రదాయమైన బొట్టు. స్నానపూర్వం మొహానికి పసుపు పూసుకున్నట్టుంది. చామనచాయ మొహం మీద పల్చటి పసుపు పూత పూసినట్టుగా అనిపిస్తోంది. అక్కడి కాంతి నున్నటి ఆమె చెక్కిళ్ల మీద పడి ప్రతిఫలిస్తోంది.

చేత రామచిలుక, పూలచెండు ధరించి నిల్చుని ఆదరవాత్సల్యాలను ప్రసరింపజేస్తున్న ఆ మీనలోచన మీనాక్షిదేవిని దర్శించుకున్నాం.

అక్కడినుంచి సుందరేశ్వరుని దర్శనానికి వెళుతున్నప్పుడు అడిగాను – ''ఏమని దణ్ణం పెట్టుకున్నారు?''అని.

నవ్వింది కానీ చెప్పలేదు.

అక్కడ ముందుగా అమ్మవారిని దర్శించాలి. ఆ తర్వాతనే అయ్యవారి దర్శనం.

''చెప్పరేం? రహస్యమా?''

''అవును. రహస్యమే.''

''ఐతే చెప్పకూడదా?'

''చెప్పొచ్చు. కానీ ఇప్పుడు కాదు. తర్వాత చెబుతాను'' అని వూరుకుంది.

ఎందువల్లనో ఆమె నాకు కొత్తమనిషిలా అనిపించలేదు. ఇంతకుముందే బాగా పరిచయం, స్నేహం వున్నట్టుగా అనిపించింది. అందుకే మీనాక్షితో మాట్లాడుతుంటే కొత్తగానూ, బెరుగ్గానూ లేదు.

ఈమాటే ఆమెతో అంటే తనకూ అలాగే వున్నదని చెప్పింది. అదే బాడీ లాంగ్వేజ్ అన్నాను. నవ్వింది నిజమేనేమో అన్నట్టు.

సుందరేశ్వరుని దర్శన అనంతరం ఆమెను వాళ్ల దగ్గరకు చేర్చే ప్రయత్నం చేశాను. గబగబా నడుస్తున్నా ఆమె దృష్టి స్తంభాల మీద చెక్కిన శిల్పాల మీదనే వుంది. వాటిని చూస్తూ ఒకచోట ఆగిపోయి అడిగింది –

''మీకు కొంచెం తమిళం వచ్చనుకుంటాను''

''అవునవును.''

''ఎలా నేర్చుకున్నారు?''

''ఈమధ్య ముప్పయ్ రోజులలో తమిళ భాష నేర్చుకుంటున్నాను''

**ఎందువల్లనో ఆమె నాకు కొత్త మనిషిలా అనిపించలేదు. ఇంతకు ముందే బాగా పరిచయం, స్నేహం వున్నట్టుగా అనిపించింది. అందుకే మీనాక్షితో మాట్లాడుతుంటే కొత్తగానూ, బెరుగ్గానూ లేదు. ఈమాటే ఆమెతో అంటే తనకూ అలాగే వున్నదని చెప్పింది. అదే బాడీ లాంగ్వేజ్ అన్నాను. నవ్వింది నిజమేనేమో అన్నట్టు.**

పెద్దగా నవ్వింది.

''మరి మీరు మాట్లాడే తెలుగు సంగతి యేమిటి? మీరూ నాలాగే...''

''కాదు. ఉద్యోగరీత్యా మేం కొన్నాళ్ళు మద్రాసులో వున్నాం. మా ఇంటి పక్కనే తెలుగు వాళ్లుండేవాళ్లు. అప్పుడు వాళ్ల దగ్గర తెలుగు చదవటం నేర్చుకున్నాను గానీ అంత బాగా రాదు.''

''అవును. అందుకే మీరు తెలుగు మాట్లాడుతున్నా అచ్చు అరవంలాగానే వుంది.''

ఈసారి ఆమె పెద్దగా నవ్వి ''మంచి జోకే'' అన్నది.

ఇంకొంతసేపటికి తూర్పు గోపురానికి ఎదురుగా వసంత మండపం దగ్గర వాళ్లు కన్పించారు. వాళ్లని చూడటంతోనే ''అదిగో అమ్మ'' అన్నది మీనాక్షి అమ్మాళ్ సంతోషంగా.

తల్లికి నన్ను పరిచయం చేసింది. ఆమె పేరు పొన్నమ్మాళ్‌ట. దాదాపు మీనాక్షి అమ్మాళ్ లాగానే వుంది. జుట్టు చెంపల దగ్గర నెరిసింది. కొంచెం నల్లగా వుందని గాని మొహం బాగానే కళగా వుంది. నుదుటి మీద విభూతి బొట్టు.

భర్త పోవడంతో ఆమెకు ఉద్యోగం ఇచ్చారుట. ప్రస్తుతం ఆమె తిరుచ్చిలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోందట.

''కొంచెంసేపు మీరిక్కడే వుంటారా?'' తల్లిని అడిగింది.

''ఎందుకు?''

''చూడాల్సినవి ఇంకా కొన్ని మిగిలాయి.''

''త్వరగా వచ్చెయ్యాలి''

''పదండి'' అని కదిలింది మీనాక్షి. ఆమెను అనుసరించాను. నడుస్తూనే చెప్పాను ''ఎప్పుడో త్వరలో నేను మీ వూరు రావలసి వుంటుంది'' అని.

''ఎందుకు?''

''ఇక్కడో ఉద్యోగానికి అప్లయ్ చేశాను. ఎప్పుడో ఇంటర్వ్యూకి పిలుస్తారు''.

''ఐతే ఇప్పుడు మీరు నిరుద్యోగా?''

''కాదు. గుంటూరులో ఓ కంప్యూటర్ సెంటర్‌లో కోచ్‌గా చేస్తున్నాను.''

''ఐతే హార్టీ వెల్‌కమ్ టు తిరుచినాపల్లి''

''థాంక్ యూ వెరీమచ్.''

కోంబత్తడి మండపం దాటి వెయ్యి స్తంభాల మండపం దగ్గరకు వచ్చాం. ముందుగా మమ్మల్ని ఆ పైకప్పుమీది అరవై అరలతో చెక్కబడిన చక్రం అమితంగా ఆకర్షించింది. అది అరవై సంవత్సరాలకు సూచికట. ఆ మండపంలో దాదాపు వెయ్యి స్తంభాలున్నాయి. చిత్రమేమిటంటే – ఏ కోణం నించి చూసినా అవన్నీ ఒకే వరుసలో అమరివున్నట్టు కనపడతాయి.

''అద్భుతం కదూ?'' అన్నది అమ్మాళ్ తన్మయంగా అన్నిటినీ చూస్తూ –

''అవును. మన పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వపు సంపద అమోఘం. నాకయితే ఓ శిల్పంగా మారిపోయి కలకాలం ఇక్కడే వుండిపోవాలనుంది'' అన్నాను.

కొంచెంసేపటికి ''వాళ్లు ఎదురుచూస్తూ వుంటారు. ఇక వెళదామా?'' అన్నది మీనాక్షి.

''ఐతే మన విడిపోతున్నాం''

కొంచెం బాధగా అన్నానేమో! నా గొంతులోని బాధను అర్థం చేసుకున్నట్టు ''ఎప్పుడైనా విడిపోక తప్పదు కదా'' అని ''ఇంతకీ ఈ వూరు మీకు బాగా తెలుసునా?'' అనడిగింది.

''నాలుగైదుసార్లు వచ్చాను. ప్రధాన వీధులన్నీ బాగానే తెలుసు.''

ఆమె తన ఇంటి అడ్రసు చెప్పింది. నా దగ్గర వున్న చిన్న పుస్తకంలో రాసుకున్నాను. ఫోన్ నెంబరు కూడా చెప్పింది. నా విజిటింగ్ కార్డును ఆమెకిచ్చాను.

''మీకు మెయిన్ రోడ్డు మీద వసంతభవన్ తెలుసా?'' అడిగింది నడుస్తూ.

''తెలుసు''

''వసంతభవన్ దాటి కొంచెం పైకి వస్తే పిళ్లై కాలేజీ వుంది పార్కింగ్ ప్లేస్ ఎదురుగా. ఆ కాలేజీ

వెనుక రోడ్డులోనే మా ఇల్లు. ఆ రోడ్డులోకి వచ్చి నా పేరు చెబితే ఎవరయినా మా ఇల్లు చూపుతారు. ఎందుకంటే ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత సాయంత్రం వేళ ఆ వీధిలో పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చెబుతాను.''

ఓ ప్రయివేటు కంపెనీలో మీనాక్షి అమ్మాళ్ క్లర్కుగా ఉద్యోగం చేస్తోందిట.

ఇక – మాకోసమే ఎదురుచూస్తున్నారు వాళ్లు. తల్లీ కూతుళ్ల దగ్గర సెలవు తీసుకుని అక్కడినుంచి మా కారు పార్కుచేసిన బస్టాపు దగ్గరకు బయల్దేరాను. తిరిగి వచ్చేటప్పుడు ఆమె ఇంకోసారి చెప్పింది వాళ్లింటికి రావటం మరచిపోవద్దని. మీనాక్షి కళ్లలోనూ అదే బాధ. కొద్ది సమయంలోనే బాగా కలిసిపోయాం. ఏదో వెలితిగా అనిపించింది.

కారు దగ్గర మావాళ్లు నాకోసం ఎదురు చూస్తున్నారు. తిరిగి మా ప్రయాణం మొదలయ్యింది. మెలకువగా వున్నంతసేపూ నా కనులముందు మీనాక్షి అమ్మాళ్ రూపం కదులుతూనే వుంది. ఆమె మాటలు – మాటలకు ముందు చిరునవ్వు – మిలమిల మెరిసే కళ్లు – స్వచ్ఛమయిన ఆ చూపులో ఆత్మీయతాభావం – చూడగానే ఆకట్టుకునే శరీరాకృతి. ఒక నిద్రపోయాక కలలో కూడా మళ్లీ సాక్షాత్కరించింది. ఇద్దరం కలిసి మరెన్నో దేవాలయాలు దర్శించినట్టు, ఓ తెల్లవారుజామున సన్నగా వర్షం కురుస్తున్నప్పుడు రామేశ్వరంలో ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని సరిసముద్రస్నానం చేసినట్టూ ఒకే కల. రిపీట్ అవుతూనే వుంది.

మధ్యలో కారుకు రిపేరు. రెండు గంటలపాటు రోడ్డు మీదనే. నాకు అదేమీ తెలీదు. మీనాక్షి అమ్మాళ్‌తో కలిసి ఎక్కడెక్కడో విహారాలు.

కుర్తాళంలో జలపాతం దగ్గర కారు ఆగేసరికి మసకవెలుతురు అప్పుడే విచ్చుకుంటున్నది. తూరుపు తెల్లబడుతోంది.

మా కారు పక్కనే ఓ పొడవాటి టూరిస్టు బస్సు. స్నానం చెయ్యటానికి బట్టలు తీసుకుని కార్లోనుంచి దిగి బస్సునుదాటి రెండడుగులు వెయ్యగానే వంటిని అంటుకుపోయిన తడి బట్టలతో అప్పుడే చెక్కిన అజంతా శిల్పంలా ఎదురుగా తొలిసంధ్య వెలుగులో మీనాక్షి అమ్మాళ్ ప్రత్యక్షమయ్యింది గబగబా నడిచివస్తూ –

''మీరా'' అన్నది ఆశ్చర్యంగా.

''మీరేనా!'' అదే ఆశ్చర్యంతో అన్నాను గుండెలో పొంగివస్తున్న సంతోషాన్ని అణచుకుంటూ.

చలికి చిన్నగా వణుకుతోంది. తలమీదనుంచి నీళ్లు కారుతున్నాయి.

జలపాతం హోరు వినపడుతోంది.

''త్వరగా స్నానం చేసి రండి. ఆరు గంటలకు కోవెల తలుపులు తెరుస్తారట'' అని వెళ్లింది.

నాలో ఆనందపు అల ఎగిరిపడింది. మీనాక్షి అమ్మాళ్ అనే సంతోషం ఆ జలపాతంలా ఎక్కడినించో నామీదకు ఎగిసిపడుతోన్నది.

జలపాతం దగ్గరకు వచ్చాను. బాగా ఎత్తుగా వున్న కొండ మీదనుంచి నాలుగు పాయలుగా చీలి కిందికి విసురుగా పెద్ద హోరుతో పడుతున్నాయి నీళ్లు.

''ఆకాశంబున నుండి శంభుని శిరంబు'' పద్యం గుర్తుకు వచ్చింది. వివేకభ్రష్ట సంపాతముల్ – అంటే ఇదేనేమో! కిందపడిన నీళ్లు బండరాళ్ల మీద నుంచి కాలువలోకి వెళుతున్నాయి.

అప్పటికే అక్కడ కొంతమంది ఆ జలపాతం కింద స్నానం చేస్తున్నారు.

నేనూ స్నానం చేసి వెళ్లేసరికి మీనాక్షి అమ్మాళ్ పొడి బట్టలు కట్టుకుని నాకోసం ఎదురుచూస్తోంది. ఆమె జుట్టు చివర్ల నుంచి నీళ్లు కారుతున్నాయి.

గబగబా బట్టలు మార్చుకుని వచ్చి ''కాఫీ తాగుదామా?'' అన్నాను ఆమెతో.

''వద్దు. ముందు కోవెలకు వెళదాం''

అక్కడికి ఈశ్వరుడి కోవెల దగ్గరే. కాలువ మీద వున్న వంతెన మీదనుంచి అవతలివైపుకు వెళ్లి రాశులుపోసి అమ్ముతున్న సుగంధ ద్రవ్యాల దుకాణాల

ఆసక్తిగా చూశాను. ఆమె ఓ సబ్బును కొని నాకిచ్చింది. ''ఏమిటిది?'' అడిగాను ఆశ్చర్యంతో. ''దీనిపేరు కృష్ణతులసి. మీవైపు దొరకదనుకుంటాను. ఈ సబ్బు వాసనంటే నాకు చాలా ఇష్టం. దీన్ని మీరు వాడుకోవద్దు. వాడకుండా వుంచుకోండి. ఈ సబ్బును చూసినప్పుడల్లా ఈ మీనాక్షి అమ్మాళ్ మీకు గుర్తురావాలి.''

ముందునుంచి నడుచుకుంటూ వెళితే ఆ చివరలోనే ఈశ్వరుడి కోవెల.

అప్పుడే తలుపులు తెరిచారు.

రెండు చేతులూ జోడించి భక్తితో కళ్లు మూసుకుంది మీనాక్షి నా పక్కనే నిల్చుని. మళ్లీ అదే రూపం. మీనాక్షి కోవెలలో నా పక్కనే సాక్షాత్కరించిన రూపం.

''ఇప్పుడయినా చెబుతారా? ఏమని దణ్ణం పెట్టుకున్నారో?'' మళ్లీ అడిగాను.

''చెబుతాను. కాని ఇప్పుడు, ఇక్కడ కాదు. మీరు మావూరు వచ్చినప్పుడు చెబుతాను.''

కొంచెంసేపటికి అప్పుడే తెరిచిన షాపుల మధ్య నించి నడుస్తున్నాం. ఆమె ఏదో చెబుతోంది ఆవూరి గురించి.

''ఇక్కడో పీఠాధిపతి వున్నారు తెలుసా?''

''తెలీదు''

''భలేవారే. తెలీదా? ఆయనదీ మీవూరే. గుంటూరు. చూస్తారా ఆయన్ని?''

''ఏమో –. మావాళ్లను అడగాలి.''

నడుస్తున్నదల్లా ఓ అంగడిముందు ఆగి ''నా గుర్తుగా ఒకటి కొనిస్తాను'' అన్నది.

ఆసక్తిగా చూశాను. ఆమె ఓ సబ్బును కొని నాకిచ్చింది.

''ఏమిటిది?'' అడిగాను ఆశ్చర్యంతో.

''దీనిపేరు కృష్ణతులసి. మీవైపు దొరకదనుకుంటాను. ఈ సబ్బు వాసనంటే నాకు చాలా ఇష్టం. దీన్ని మీరు వాడుకోవద్దు. వాడకుండా వుంచుకోండి. ఈ సబ్బును చూసినప్పుడల్లా ఈ మీనాక్షి అమ్మాళ్ మీకు గుర్తురావాలి.''

కృతజ్ఞతలు చెప్పాను. నా గుర్తుగా నేను కూడా ఆమెకు ఏదైనా కొనివ్వాలనుకున్నాను. కానీ ఏం కొనాలో తోచలేదు. ఇలా ఆలోచిస్తున్నప్పుడే ఇద్దరం అన్ని షాపులనీ, జలపాతాన్నీ దాటి వచ్చేశాము.

అక్కడే వున్న చిన్న హోటల్లో కాఫీ తాగాం.

కారు దగ్గరకు వచ్చేసరికి మావాళ్లు నాకోసం ఎదురు చూస్తున్నారు. మేం రామేశ్వరానికి బయల్దేరుతున్నాం.

''మీ ప్రయాణం ఎటు?'' ఆమె నడిగాను.

''ఇక తిరుచ్చికే''

మా కారు కదిలింది. ఆమె నవ్వుతూ వీడ్కోలు చెప్పింది.

''ఎవరామె?'' అడిగారు మావాళ్లు.

''మీనాక్షి అమ్మాళ్''

''అంటే?''

''మనలాంటి ఓ టూరిస్టు''

ఆ మాటలతో అంతా నవ్వారు ఆ విషయం మాకు తెలుసన్నట్టు. అంతకుమించి వాళ్లకేమీ చెప్పలేదు.

అయినా చెప్పడానికి ఏముందని?

రామేశ్వరంలో మీనాక్షి నా పక్కనే వుండి అన్నీ అడుగుతున్నట్టు, నేను చెబుతున్నట్టూ భ్రమకు లోనయ్యాను.

ఇంటికి వచ్చినా ఆ భ్రమ నన్ను వదల్లేదు. ఇక వుండలేక తిరుచ్చికి ఫోన్ చేశాను. పొన్నమ్మాళ్ మాట్లాడింది. మీనాక్షి సినిమాకు వెళ్లిందట.

ఒకరోజు పోస్టులో తిరుచ్చిలో నేను అప్లయ్ చేసిన ఉద్యోగానికి ఇంటర్వ్యూకు రమ్మని ఉత్తరం వచ్చింది. వారం రోజుల్లో వెళ్లాలి.

అప్పటికప్పుడే మీనాక్షికి ఫోన్ చేసి ఎప్పుడు బయల్దేరి వస్తున్నదీ చెప్పాను.

ఒకరోజు ముందుగా వెళ్లాను అక్కడకు. ఆమె చెప్పిన గుర్తుల ప్రకారం వాళ్ల ఇల్లు తెలుసుకోవటం సులభమయింది.

ఇంట్లోనే వుంది. మీనాక్షి అమ్మాళ్. ముందు గదిలో పదిమంది పిల్లలు చదువుకుంటున్నారు.

సాదరంగా నన్ను ఆహ్వానించింది నవ్వుతూ.

కొంచెంసేపటికి ఆమె తల్లి పొన్నమ్మాళ్ ఆఫీసు నుంచి వచ్చింది.

''ఏదయినా హోటల్లో బసచేస్తాను'' అన్నాను.

''ఎందుకు? మా ఇంట్లో వుండండి. అభ్యంతరం లేదు''

పొన్నమ్మాళ్ కూడా అదే అన్నది.

ఉదయం పదిన్నరకు ఇంటర్వ్యూ.

''ప్రిపేరవుతారా?'' భోజనానంతరం అడిగింది.

''నో ప్రిపరేషన్''

కొంచెంసేపు కబుర్లు చెప్పి ఆపైన గుడ్‌నైట్ చెప్పి వెళ్లిపోయింది మీనాక్షి అమ్మాళ్.

ఆమె వెళ్లినా ఆమె తలపులు నన్ను వీడలేదు. ఆమె – ఆమె తలపులు ఎన్నటికీ నన్ను వీడకుండా వుంటే బావుండుననిపించింది. అవును. మీనాక్షికి ఏం తక్కువ. అరవ అమ్మాయి అయితేనేం? మీనాక్షి వొప్పుకుంటే? అంతకంటే నాకు కావలసింది ఏముంది?

ఒప్పుకుంటుందా? అడిగి చూడాలి.

మర్నాడు మీనాక్షి కూడా ఆటోలో నాతో కలిసి ఇంటర్వ్యూ జరిగే ఆఫీసుకు వచ్చింది.

కారిడార్లో కూర్చున్నాం. మీనాక్షిని ఎప్పుడు, ఎలా అడగాలా అని ఆలోచిస్తున్నాను. పదకొండు గంటలకు నన్ను పిలిచారు. ఆపైన ఇరవై నిముషాలకు బయటకు వచ్చాను.

''ఎలా చేశారు?'' ఆత్రంగా అడిగింది.

''నాట్ బేడ్''

''ఇంతకీ ఉద్యోగం వస్తుందా?''

''మీ శ్రీరంగనాథుడి దయ''

పెద్దగా నవ్వింది.

ఇంటికి వెళ్లేసరికి వరండాలో ఒక యువకుడు మీనాక్షికోసం ఎదురుచూస్తున్నాడు. అతడిని వరదరాజన్‌గా పరిచయం చేసింది. అతడి మొహాన అరవ కళ ఉట్టిపడుతోంది. ఏదో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నాడుట. బొత్తిగా తెలుగు రాదు. మేమిద్దరం తెలుగులో మాట్లాడుకుంటున్నప్పుడు నోరు తెరుచుకుని చూశాడు. కొంచెంసేపటికి వెళుతున్నానని అరవంలో చెప్పి నాతో కరచాలనం చేసి వెళ్లాడు.

అతడు వెళ్లాక ''వరదరాజన్ ఎలా వున్నాడు?'' అనడిగింది మీనాక్షి అమ్మాళ్.

''ఎందుకు?''

''అతన్ని నేను పెళ్లి చేసుకోబోతున్నాను''

ఆ మాటతో నా మొహాన కళ తప్పినట్లయింది. ఆ కళను మీనాక్షి గుర్తించి వుండాలి. ఊహించని పరిణామం. ఎదురుచూడని క్లయిమాక్స్.

''ఇంకో నెలరోజుల్లో మా పెళ్లి ఇక్కడే జరుగుతుంది. మీరు తప్పక రావాలి. రాకపోతే నామీద ఒట్టు.''

ఇవేమీ నాకు సరిగా వినిపించడం లేదు. ఇలా జరిగిందేమిటి? ఇంకా నా మనసులో మాట బయటకు రాలేదు. తొందరపడి బయటపడనందుకు కొంచెం వూరట కలిగింది.

''శ్రీరంగం చూడాలన్నారు గదా... సాయంత్రం వెళదామా?'' అడిగింది.

''మీ పెళ్లికి వచ్చినప్పుడు చూస్తాను. మూడు గంటలకు మద్రాసుకు బస్సు వుందిట. వెళతాను.''

''పోనీ... ఇంకోరోజు వుండకూడదూ?''

''సారీ... వెళ్లాలి. మరిచాను. బైదిబై మీ పెళ్లికి నా మనఃపూర్వక అభినందనలు'' అబద్ధం చెప్పాను.

థాంక్స్ చెప్పింది.

ఆఫీసు దగ్గరే కాబట్టి ఆ మధ్యాహ్నం భోజనానికి పొన్నమ్మాళ్ ఇంటికి వచ్చింది. ఆ సాయంత్రం తిరిగి వెళుతున్నట్టు ఆమెకు చెప్పాను. మీనాక్షి పెళ్లికి శుభలేఖ పంపుతామనీ, తప్పకుండా రమ్మనీ చెప్పింది.

బస్టాపుకు తనూ వచ్చింది మీనాక్షి – నన్ను సాగనంపటానికి. బస్సు బయల్దేరటానికి ఇంకొంచెం వ్యవధి వుంది. ఆమెతో మాట్లాడాలన్నా, ఆమె కళ్లలోకి చూడాలన్నా ఏదోలా వుంది. ఆమె పెళ్లివార్త నా గుండె మీద అంతటి గట్టి దెబ్బను కొట్టింది.

''మాట్లాడరేం?'' నవ్వుతూ అడిగింది నా మౌనానికి కత్తెరవేస్తూ.

ఏం మాట్లాడగలను? తిరిగి మౌనం.

''జీవితం నా దృష్టిలో స్థిరమైనది.''

ఎందుకో ఆ ఉపోద్ఘాతం మొదట్లో తెలీలేదు.

మళ్లీ తనే అన్నది –

''స్థిరమైన జీవితంలో వీలున్నంతవరకు స్థిరమైన నిర్ణయాలే తీసుకోవాలి. చాలా రోజుల్నించీ వరదరాజన్‌కీ నాకూ మధ్య ప్రేమాయణం నడుస్తోంది. పెళ్లి చేసుకోవాలనుకున్నాం. ఈరోజు మీరు కలిశారని నా నిర్ణయాన్ని మార్చుకోలేను గదా?''

దెబ్బతిన్నట్టు చూశాను. ఇంకా నవ్వుతూనే వుంది.

''అంతేకాదు. స్నేహానికీ, ప్రేమకీ మధ్య వున్న గీత చాలా పలుచనైనది. రూపాయి నోటు మీదున్న వాటర్ మార్కులాగా ప్రత్యేకించి చూస్తేగానీ తెలీదు. మన మధ్యనా అలాంటి గీతే వుంది. మీరు నన్ను ప్రేమించానని అనుకుని వుండొచ్చు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకుని వుండవచ్చు. కానీ నా పరిస్థితి యేమిటి? ఇంతకుముందు మీరు ఎన్నిసార్లడిగినా చెప్పలేదు. ఇప్పుడు చెబుతున్నాను. వరదరాజన్‌తో నా పెళ్లి జరగాలని దణ్ణం పెట్టుకున్నాను. ఏదయినా వరదరాజనే ఈ జన్మకు నా మొగుడు'' – అని మళ్లీ నవ్వింది.

ఆమె నా మనసును ఓ పుస్తకంలా చదివేసింది. పవర్‌ఫుల్ కెమెరాతో ఫోటోగ్రాఫ్ తీసింది.

''సరే.. ఇంతకీ మీకు పునర్జన్మల మీద నమ్మకం వుందా?'' నవ్వి అడిగింది.

''ఎందుకూ?'' అర్థం అవక అడిగాను.

''చెప్పాను గదా... వరదరాజన్ ఈ జన్మలో మాత్రమే నా మొగుడు''

అప్పుడు నా కళ్లు మెరిశాయి. అయితే సంతోషించాలో, విచారపడాలో తెలియని అయోమయ పరిస్థితి. ఎవరయినా కోరుకున్న దానికోసం కొన్నాళ్లు ఎదురుచూస్తారు. కొన్నేళ్లు ఎదురుచూస్తారు. కానీ మీనాక్షి అమ్మాళ్‌కోసం నేను ఓ జన్మంతా ఎదురుచూడాలి. సుదీర్ఘ నిరీక్షణ. ఎక్కడా వుండదేమో!

''నెక్స్ట్ టైమ్ బెటర్ లక్'' నవ్వుతోంది.

బస్సు ఇంజన్ స్టార్టయ్యింది.

''ఇక నే వెళతాను''

''విష్ యూ హేపీ జర్నీ'' చేతిని ముందుకు చాచింది కరచాలనం కోసమన్నట్టు. నా కుడిచేత్తో ఆమె సుకుమారమయిన చేతిని మృదువుగా నొక్కాను. తప్పులేదు. ఎందుకంటే – మీనాక్షి అమ్మాళ్ వచ్చే జన్మలో నాక్కాబోయే భార్య కాబట్టి.

★

